క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మూడు అతిథి అధ్యాపక పోస్టుల(కామర్స్)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. కామర్స్ సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ కలిగి 55 శాతం మార్కులు ఉన్న వారు అర్హులని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటన పేర్కొన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఎస్ఎల్ఈటీ, ఏపీ సెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తుతోపాటు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 9న ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దాత, ఆలయ సిబ్బంది

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా వేదవల్లి సమేత వేదనారాయణ స్వామివారి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చెన్నైకు చెందిన మృదుల, ఆమె కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయ షరాబు ఉదయ్‌కుమార్ దర్శన ఏర్పాట్లు చేసి, స్వామి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్యులు, బలరామ్ పాల్గొన్నారు.

ముక్కంటికి కూరగాయల వితరణ


సొరకాయలు అందజేస్తున్న దాత మురళి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దాత మురళి ప్రకృతి వ్యవసాయంతో పండించిన 1,116 కిలోల సొరకాయలను వితరణ చేశారు. ఆలయాధికారులు వాటిని స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

మహిళల నిరసన


ఐకేపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్త పాళెంలోని మహిళా సంఘాల నగదు స్వాహా చేయడంతో ఉద్యోగం నుంచి తొలగించిన సునీతను మళ్లీ సంఘమిత్రగా నియమించవద్దని శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 25 మహిళా సంఘాలుండగా అందులో 250 మంది మహిళలున్నారన్నారు. ఐదేళ్ల కిందట ఇదే గ్రామానికి చెందిన సునీత సంఘమిత్రగా పనిచేసి, ఈఓ, బ్యాంకు నిధులు రూ.12 లక్షల నగదును స్వాహా చేశారని తెలిపారు. దీంతో సంఘమిత్ర ఉద్యోగం నుంచి అధికారులు తొలగించడం జరిగిందన్నారు. అవినీతికి పాల్పడిన సునీతను మళ్లీ సంఘమిత్రగా నియమిస్తే ఊరుకోమన్నారు. అనంతరం ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

భాషా నైపుణ్యం పెంపునకు కృషి


పుస్తకాలు అందజేస్తున్న ప్రవాస భారతీయ అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు

ఏర్పేడు: విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని పల్లం హైస్కూలు హెచ్ఎం ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని పల్లం హైస్కూల్‌లో ప్రవాస భారతీయ వాసవీ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.50 వేలు విలువచేసే గ్రంథాలయ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయ వాసవీ అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు కేవీబాబు, మెహర్‌బాబు, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, పుష్పవాణి, వాణి పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

ఏర్పేడు: ఉపాధిహామీ పనుల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని మన్నసముద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్‌లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో రోజుకు రూ.300 వేతనం వచ్చేలా కూలీలకు కొలతలు ఇవ్వాలన్నారు. ఇచ్చిన కొలతలను కూలీలతో చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరి, జేఈ బాలాజీరావు, కూలీలు పాల్గొన్నారు.

పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ పట్టభద్రులు, నేషనల్ అక్రిడిటేషన్ ల్యాబ్ బోర్డు ధ్రువీకరణ పత్రం, వైద్యారోగ్య శాఖ అనుమతుల లేమి.. ధనార్జనే ధ్యేయంగా ల్యాబ్‌ల నిర్వహణ.. వ్యాధి సంగతి అటుంచితే కొత్త రోగం అంటగట్టడం..కొన్ని సందర్భాల్లో తప్పుడు రిపోర్టుల జారీ.. వెరసి పేదల ప్రాణాలతో చెలగాటం. ఇదీ వరదయ్యపాళెం మండలంలో మెడికల్ ల్యాబ్‌ల పరిస్థితి.

ల్యాబ్‌ార్జన

- వరదయ్యపాళెంలో అనధికారిక ల్యాబ్‌లు
- ఆరోగ్య పరీక్షల పేరిట దర్జాగా దోపిడీ
- మండలంలో 5 లైసెన్స్‌లు లేని ల్యాబ్‌లు
- ఆకస్మిక తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- ఇన్నాళ్లు పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ


వరదయ్యపాళెంలో స్టార్ డయాగ్నొస్టిక్స్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న వైద్యాధికారి ద్వైత(ఫైల్)


వరదయ్యపాళెంలోని హెల్త్‌కేర్ డయాగ్నొస్టిక్స్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి ద్వైత(ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలో ప్రభుత్వ వైద్యఆరోగ్యశాఖ అనుమతి, ఆరోగ్య పరీక్షలకు సంబంధించి నైపుణ్యత లేకుండా దర్జాగా అనధికారికంగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య పరీక్షల పేరిట ధనార్జనే ధ్యేయంగా దర్జాగా పేదలను దోపిడీ చేస్తున్నారు. ఈ అక్రమ దోపిడీ తంతు రెండు రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. వరదయ్యపాళెంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ద్వైత తన సిబ్బందితో కలసి శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌ల బండారం బయట పడింది.


చిన్న పాండూరులో హేమల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య(ఫైల్)

మండలంలో 5 లైసెన్స్ లేని ల్యాబ్‌లు

తనిఖీల్లో మండల కేంద్రంలోని స్టార్ డయాగ్నొస్టిక్స్, హెల్త్‌కేర్ డయాగ్నొస్టిక్స్, పద్మ ల్యాబ్, ఆయుష్మాన్ డయాగ్నొస్టిక్స్ ల్యాబ్‌లకు ప్రభుత్వ అనుమతి లేని విషయం గుర్తించారు. అలాగే మండలంలోని చిన్న పాండూరులో హేమ ల్యాబ్‌ను అక్కడ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లావణ్య తనిఖీ చేసి లైసెన్స్ లేదని నిర్ధారించా. ఈ రెండు చోట్ల గుర్తించిన అనధికారిక ల్యాబ్‌ల గురించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి నివేదిక అందజేశామని వారు తెలిపారు. వారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు తెలిపారు.

ఇష్టారాజ్యంగా దోపిడీ

వరదయ్యపాళెంలో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల ల్యాబ్‌లన్నీ అనధికారికమేనని తేలింది. వీరు ఎలాంటి అనుమతులు లేకనే ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ ఆరోగ్య పరీక్షల పేరిట ఇన్నాళ్లు దోపిడీ చేస్తున్నా స్పందించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ నిద్రావస్థలో ఉంది. అయితే అనధికారికమేనని తేలినప్పటికీ వాటిని సీజ్ చేయాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నేటికీ వెనకడుగు వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ల్యాబ్‌ల్లో నైపుణ్యత లేని వారితో పరీక్షలు చేయించడం, తద్వారా తప్పుడు సమాచారాన్ని పరీక్షల నివేదికలో పొందుపరచడం.. ఇలా పేద ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న అనధికారిక ల్యాబ్‌ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కదిలేనా జిల్లా యంత్రాంగం?

గ్రామీణ స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న నకిలీ ల్యాబ్‌ల ద్వారా భారీగా దోపిడీ చేస్తున్న ఘటన వెలుగు వచ్చింది. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం ఏ మేరకు స్పందిస్తుందోనని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ ల్యాబ్‌ల గురించి రెండు రోజుల క్రితమే జిల్లా అధికారులకు నివేదిక అందినప్పటికీ యథావిధిగా వరదయ్యపాళెం మండలంలో ల్యాబ్‌ల నిర్వహణ దర్జాగా కొనసాగుతోంది. చర్యలు తీసుకోకనే రహస్యంగా వారి నుంచి ముడుపులు తీసుకుని ల్యాబ్‌లు కొనసాగించేందుకు అనుమతులు ఇచ్చేస్తారా? అన్న విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది. ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి మరి.

అనధికారిక ల్యాబ్‌లపై చర్యలు



జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు వరదయ్యపాళెంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ప్రైవేటు ల్యాబ్‌లను ఆకస్మిక తనిఖీ చేశాం. అందులో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఐదు ల్యాబ్‌లను గుర్తించాం. వారి వివరాలను నమోదు చేసుకుని జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ వారికి నివేదించాం. వారి నుంచి వచ్చే చర్యల ఆధారంగా అనధికారిక ల్యాబ్‌లపై తదుపరి చర్యలు తీసుకుంటాం. అప్పటి వరకు వారు ల్యాబ్‌ల్లో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదని ఆదేశించాం. అలా నిర్వహిస్తే చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేయం.

–ఉదయ్‌కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంపు



సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగలోని తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తును శనివారం ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి పెంచారు. దీంతో ప్రమాదం లేకుండా పోయింది. శనివారం సాక్షి దినపత్రికలో పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించి ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి విద్యుత్ స్తంభానికి నాలుగు అడుగుల ఎత్తులో అమర్చిన సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 అడుగుల ఎత్తుకు పెంచారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మేళా

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం బీఎస్ఎన్ఎల్ ఫ్రీ సిమ్ మేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ ప్రాంతీయ అధికారి వీరరాఘవయ్య ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే మేళాలో 3జీ నుంచి 4జీ సిమ్ మారడానికి, నూతన సిమ్‌లు తీసుకోవడానికి, ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారడానికి వీలు కల్పించనున్నట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఏర్పేడు: పుస్తక పఠనంతో విజ్ఞానం కలుగుతుందని ప్రజాసాధికారిక ట్రస్టు ప్రతినిధి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని పల్లంపేట ప్రాథమిక పాఠశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రజాసాధికారిక ట్రస్టు ప్రతినిధులు సరిత, సురేష్, చంద్రశేఖర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై హెచ్‌ఎంలకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: పాఠశాల నిర్వాహక కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలపై మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన అన్ని పాఠశాలల్లో నిర్వాహక కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో ఎంపికయ్యే ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు పాఠశాలల నిర్వహణ, యాజమాన్య బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల అభివృద్ధికి దోహదపడే ఈ కమిటీ ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉంటుందన్నారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుని, వారి ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి కమిటీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. 8వ తేదీ ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నిక నిర్వహిస్తారని చెప్పారు. చేతులు ఎన్నితే పద్ధతిలో సభ్యులను ఎన్నుకొంటారని తెలిపారు. పోటీ తీవ్రంగా ఉంటే మాత్రం రహస్య ఓటింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, ఎంఈఓ – 2 ఉషా, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయమంత్రికి సాదర స్వాగతం


కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న నేతలు

రేణిగుంట: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ శ్రీకాళహస్తి దేవస్థానం శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు. ఆయనకు బీజేపీ నాయకురాలు శాంతారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తదితరులు స్వాగతం పలికి పూలమాలలు వేసి సత్కరించారు.

వేడుకగా పల్లకీ సేవ


పల్లకీల్లో ఊరేగుతున్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి (ఇన్‌సెట్) విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామివారి పల్లకీ సేవ శనివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను వేర్వేరు పల్లకీల్లో కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. మూడు పల్లకీల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తుల బారులు తీరారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ భానుప్రియ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ భానుప్రియ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆమె పల్లమాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో 800 మంది కూలీలు మాత్రమే పనిచేస్తున్నారని, కూలీల సంఖ్యను 3 వేలకు పెంచాలని తెలిపారు.

పోలేరమ్మ జాతరకు ఏర్పాట్లు

నాగలాపురం: మండల కేంద్రంలో పోలేరమ్మ జాతర నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలోని ముళ్ల పొదలు, చెత్త చెదారాన్ని శుభ్రం చేయించాలని గ్రామపెద్దలు సర్పంచ్ చిన్నదొరై సుధాకు విన్నవించుకున్నారు. వెంటనే సర్పంచ్ ఆలయం వద్దకు వెళ్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులతో ముళ్ల పొదలు, చెత్త చెదారాన్ని తొలగించి, ఎర్రమట్టి తోలి చదును చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హరిబాబు, దేశన్, కులశేఖర్ రెడ్డి, ధనరాజ్, పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన


మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కంచనపుత్తూరు, భవానీశంకరపురం గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మరుగుదొడ్లను శనివారం తనిఖీ ప్రత్యేకాధికారి పల్లమాల ప్రసాద్, ఎంపీడీఓ త్రివిక్రమ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, సర్పంచ్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే మన ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఊరందూరు రోడ్డులో ఉన్న బృందమ్మ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు వితంతు పింఛన్ అందనివారు అర్జీ ఇస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఇంట్లో విద్య, ఆరోగ్యం ఉండాలన్నారు. విద్య సంస్కారం, కుటుంబాన్ని కాపాడుతుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో కోర్టుకు అందిస్తే ఉచితల సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. అనంతరం వైద్యశిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అఫీజ్‌కాన్, పోలీసు అధికారులు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

ఏర్పేడు: మండలంలోని కుక్కలగుంటలో పాపానాయుడుపేట పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం జరిగిన పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కుక్కలగుంట, పాయిల్‌సెంటర్ తదితర గ్రామాలనుంచి వచ్చిన పశువులు, గొర్రెలు, మేకలకు గర్భకోశ, పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది నరేష్, రోహిత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గంగమ్మ ముగ్గు


గంగమ్మ ముగ్గు వేస్తున్న భక్తుడు


జాతరలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోటలోని చెంగాళమ్మ అమ్మవారి జాతరలో భాగంగా శనివారం దేవాలయం అవరణలో వేసిన గంగమ్మ ముగ్గు ఆకట్టుకుంది. ఆలయంలో చెంగాళమ్మకు అభిషేకాలు చేసి, విశేషాలంకరణ చేశారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. చెంగాళమ్మ జాతరలో భాగంగా విగ్రహాన్ని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి, గంగమ్మ, ముగ్గు, కలశం ఉత్సవం, శేషాపాన్పు, కలశ గ్రామోత్సవం, పోతురాజు ముగ్గు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అంబళ్లు, చెంగాళమ్మ దేవత ముగ్గు, పొంగళ్లు, జరుగుతాయి. సోమవారం ఉదయం చెంగాళమ్మ ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగింపు, ఎదురు పొంగళ్లు కార్యక్రమం జరుగుతాయని తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష


నారాయణవనం: సమావేశంలో మాట్లాడుతున్న రాగసుధ


బుచ్చినాయుడుకండ్రిగ: మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి


మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణమంజరి

నారాయణవనం: తల్లులు తమ పిల్లలకు పాలు పట్టడం ద్వారా తల్లీబిడ్డలిద్దరికీ శ్రీరామరక్ష అని పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నారాయణవనంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్య సిబ్బందితో కలిసి రాగసుధ సందర్శించి, తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలుతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు బిడ్డకు పాలు పట్టాలని అన్నారు.

తల్లి పాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి

బుచ్చినాయుడుకండ్రిగ: పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. ఆమె శనివారం కాటూరులో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి, ముర్రుపాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైఫాయిడ్, కామెర్లు, తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లి పాలలో ఉన్నాయన్నారు. బిడ్డ బరువు పెరిగేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు దోహద పడతాయని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలను తాగించడంతో శిశు మరణాలు తగ్గుతున్నట్లు, అనంతరం గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సిబ్బంది అందించే పోష్టికాహారంపై తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప పాల్గొన్నారు.

తల్లిపాలే ఆరోగ్యదాయకం

రేణిగుంట: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యదాయకమని ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణమంజరి అన్నారు. చెల్డ్ ఫండ్ ఇండియా, రాస్ ఆధ్వర్యంలో మండలంలోని ఎస్‌యూపురం, గురవరాజుపల్లి, రామకృష్ణాపురం, కృష్ణాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి, రాస్ కోఆర్డినేటర్ భారతి పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

సత్యవేడు: తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏఎంఎం శ్రీదేవి తెలిపారు. ఏఎం పురం, దాసుకుప్పం అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎం. సురేఖ, సుజాత, చంద్రమ్మ, రుక్మిణి, తులసీ తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం

ఏర్పేడు: ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని రేణిగుంట డివిజన్ సీడీపీఓ కృష్ణమంజరి అన్నారు. శనివారం మండలంలోని శివగిరి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలవారోత్సవాల సందర్భంగా ర్యాలీ, సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భానతి, ఎంఎల్‌హెచ్‌ఓ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.